క్లుప్తంగా

ఉచిత కంటి వైద్య శిబిరం



పరీక్షిస్తున్న వైద్యులు సంతోషి, సూర్యకుమారి

కె.కోటపాడు : కంటి సమస్యలకు సకాలంలో వైద్యం చేయించుకోవాలని రొంగలినాయుడుపాలెం గ్రామ సర్పంచ్ పైల పైడితల్లమ్మ అన్నారు. గ్రామంలో ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులు శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 126 మందికి కంటి పరీక్షలు చేసి 29 మందికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించారు. కంటి వైద్యులు సంతోషి, సూర్యకుమారి పరీక్షలు నిర్వహించారు. గ్రామ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ పైల కోటేశ్వరరావు సహకారం అందించారు. మాజీ సర్పంచ్ రొంగలి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైవాడ జలాశయం సందర్శన



రైవాడ జలాశయాన్ని పరిశీలిస్తున్న సీపీఎం రాష్ట్ర నాయకులు

దేవరాపల్లి: సీపీఎం రాష్ట్ర నాయకులు రైవాడ జలాశయాన్ని శనివారం సందర్శించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వై. వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న ప్రాజెక్టును పరిశీలించారు. అనకాపల్లి జిల్లాలోని మాడుగుల నియోజకవర్గంలో సాగునీటి ప్రాజెక్టులు పుష్కలంగా ఉన్నాయన్నారు. వీటిలో కీలకమైన రైవాడ ప్రాజెక్టు వేలాది ఎకరాల ఆయకట్టుకు సాగునీటితో పాటు విశాఖ వాసులకు తాగునీటిని అందిస్తుందన్నారు. ప్రాజెక్టుల అభివృద్ధిపై ప్రభుత్వం మరింత దృష్టి సారించాలన్నారు.

విశాఖ డెయిరీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌కు సత్కారం



ఆనంద్‌ను సత్కరిస్తున్న శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు

రోలుగుంట: విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్‌ను మండల పరిషత్ అధ్యక్షుడు, ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు వైఎస్సార్‌సీపీ మండల నాయకులతో కలిసి విశాఖ వెళ్లి శనివారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, పార్టీ మండల శాఖ ఉపాధ్యక్షుడు ఉలబాల రాము, బుచ్చింపేట సర్పంచ్ చంద్ర, ఎంపీటీసీ ఉలబాల సత్యవతి ఉన్నారు.

15న ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడ్డ వాహనాల వేలం

చోడవరం రూరల్: ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 15న వేలం వేయనున్నట్టు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ జోగమ్మ తెలిపారు. శనివారం ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో చోడవరం స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు, ఆటోలను వేలం వేయాల్సిందిగా అనకాపల్లి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వెల కట్టిన ధర ప్రకారం వేలం వేస్తామన్నారు. వేలంలో పాల్గొనదలిచిన వారు ఈ నెల 14వ తేదీన తమ ఆధార్, పాన్‌కార్డుల జెరాక్సులతో పాటు ఐదు వేల రూపాయల ధరావతు రుసుము చెల్లించి తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్. చంద్రశేఖర్‌ను 9346755223, 9440902385 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

జాలంపల్లిలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం

మాడుగుల రూరల్: జాలంపల్లిలో శనివారం జరిగిన ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో 58 మందిని పరీక్షించారు. కింతలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్యాధికారి కేఎం నాయుడు దీర్ఘకాలిక రోగులను పరీక్షించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి చిన్నారులకు వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ వసంత, వి.సీతారామునాయుడు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

శరవేగంగా డైవర్షన్ రోడ్డు పనులు

- భారీ వర్షాలకు కూలిపోయిన పెద్దేరు వంతెన
- రాకపోకలకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు
- కొత్త వంతెన నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు



పెద్దేరు నదిలో ఏర్పాటు చేస్తున్న డైవర్షన్ రోడ్డు

బుచ్చెయ్యపేట : భీమునిపట్నం, నర్సీపట్నం రోడ్డులో వడ్డాది పెద్దేరు నదిలో డైవర్షన్ రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పెద్దేరు నదిలో నీటి ఉధృతి తగ్గడంతో ఆర్ అండ్ బీ అధికారులు రోడ్డు డైవర్షన్ పనులు వేగంగా జరిపిస్తున్నారు. ఆరు నెలల కిందట భారీ వర్షాలకు యాభై ఏళ్ల పురాతనమైన ఈ వంతెన కూలిపోయింది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయి అనకాపల్లి, విశాఖ, అల్లూరి జిల్లాల ప్రజలకు రవాణా కష్టాలు మొదలయ్యాయి. నర్సీపట్నం, కాకినాడ, పాడేరు, విశాఖ, రాజమండ్రి, చోడవరం తదితర దూర ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులతో పాటు ఇతర వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అప్పట్లో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. రూ. 25 లక్షలతో కూలిన వంతెనను తొలగించి తాత్కాలికంగా వాహనాల రాకపోకలు సాగే ఏర్పాటు చేశారు. కొత్తగా వంతెన నిర్మాణానికి రూ. 25 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. కొత్త వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టారు. పెద్దేరు నదిలో నుండి వాహనాల రాకపోకలు సాగేలా డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేస్తున్నారు. సుమారు 110 అడుగుల పొడవుతో 105 సిమెంట్ గొట్టాలను మూడు లైన్లుగా వేస్తున్నారు. సిమ్మెంట్ గొట్టాలు భూమిలోకి దిగిపోకుండా క్రింద సిమెంట్‌తో కాంక్రీట్ ఫ్లాట్‌ఫాం కట్టి గొట్టాలు వేసి రెండు పక్కల గోడ ఏర్పాటు చేస్తున్నారు. గ్రావెల్ వేసి రోలింగ్ చేసి డైవర్షన్ రోడ్డులో వాహనాల రాకపోకలు సాగేలా చేస్తామని ఆర్ అండ్ బీ జేఈ సాయి శ్రీనివాస్ తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



మాకవరపాలెంలో పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్న డీఎస్పీ ప్రవీణ్‌కుమార్



కె. కోటపాడు హైస్కూల్లో పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న ఆర్డీవో చిన్నికృష్ణ



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జయరాం

రావికమతం: నర్సీపట్నం ఆర్డీవో జయరాం శనివారం ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని, అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. రావికమతం హైస్కూల్లో 167వ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడి విద్యుత్, తాగునీరు, బందోబస్తు ఏర్పాట్ల గురించి తహసీల్దార్ మహేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులెవరూ పోలింగ్ ఏజెంట్లుగా ఉండరాదని, ఓటర్‌గా ఉన్నవారే ఏజెంట్లుగా ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రంలోకి ప్రజా ప్రతినిధులెవరినీ అనుమతించవద్దని అధికారులకు ఆదేశించారు.

జోనల్ అధికారి పరిశీలన

మాకవరపాలెం: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలను జోనల్ అధికారి ఎ.సత్యనారాయణ పరిశీలించారు. ఈ నెల 13న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో రెండు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలను శనివారం జోనల్ అధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ఈ రెండు కేంద్రాల్లోనూ 1485 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నట్టు చెప్పారు.

మాకవరపాలెంలో..

మాకవరపాలెం: ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగే పోలింగ్ కేంద్రాలను నర్సీపట్నం డీఎస్పీ ప్రవీణ్‌కుమార్ శనివారం సాయంత్రం పరిశీలించారు. ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన రెండు కేంద్రాలను స్థానిక ఎస్‌ఐ రామకృష్ణారావుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు.

అనకాపల్లి ఆర్డీవో ఏజీ చిన్నికృష్ణ పరిశీలన

కె. కోటపాడు: జిల్లా పరిషత్ హైస్కూల్లో గల పోలింగ్ బూత్‌లను అనకాపల్లి ఆర్డీవో ఏజీ చిన్నికృష్ణ శనివారం సాయంత్రం పరిశీలించారు. ఇక్కడ రెండు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసామని, 171 పోలింగ్ బూత్‌లో 851 మంది, 172 పోలింగ్ బూత్‌లో 827 మంది పట్టభద్ర ఓటర్లు వున్నారని తెలిపారు. ఆయా కేంద్రాల్లో ప్రశాంతంగా పోలింగ్ జరిగేటట్లు అన్ని జాగ్రతలు తీసుకోవాలని స్థానిక తహసీల్దార్ ఎ. రమేశ్‌బాబుకు ఆర్డీవో సూచించారు. అలాగే పోలింగ్ కేంద్రాల్లో సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎన్నికల సీనియర్ సహాయకులు త్రిమూర్తులు, ఇతర సిబ్బంది ఉన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

రోలుగుంట: ఎంపీపీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని నర్సీపట్నం ఆర్డీవో జయరాం శనివారం సందర్శించి ఓటర్లు, సిబ్బంది కోసం చేసిన ఏర్పాట్లను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు.

నాతవరంలో..

నాతవరం: మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోసం రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు తెలిపారు. శనివారం ఎంపీడీవో, తహసీల్దార్ కనకారావు, ఎస్‌ఐ డి. లక్ష్మీనారాయణ విడివిడిగా పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. 177 పోలింగ్ కేంద్రంలో 731 మంది, 178లో 840 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు.

మాడుగులలో..

మాడుగుల రూరల్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి మాడుగుల జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను నర్సీపట్నం ఆర్డీవో హెచ్‌వీ జయరామ్ శనివారం పరిశీలించారు. సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక తహసీల్దార్ పీవీ రత్నంకు ఆదేశించారు. రెండు పోలింగ్ బూత్‌లలో 1506 మంది ఓటర్లు వున్నారని తహసీల్దార్ రత్నం ఆర్డీవోకు వివరించారు. డిప్యూటీ తహసీల్దార్ పి. సత్యనారాయణ, ఆర్‌ఐ యడ్ల వెంకటేశ్వరావు, సీనియర్ ఎన్నికల సహాయకులు వి.పూరణయ్య, వీఆర్‌వోలు భరద్వాజ, కె. పెదబాబు తదితరులు పాల్గొన్నారు.



నాతవరంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో యాదగిరీశ్వరరావు



మాడుగుల బాలికల హైస్కూల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న జయరామ్

ఇంటర్ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు



మాట్లాడుతున్న దేవరాపల్లి పరీక్షా కేంద్రం చీఫ్ సూరింటెండెంట్ యూవీఎస్ వర్మ

దేవరాపల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్, పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ యూవీఎస్ వర్మ తెలిపారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఇంటర్ ప్రథమ, ద్వితీయ విద్యార్థులకు ఈ నెల 15 నుండి ప్రారంభమై వచ్చే నెల ఒకటో తేదీ వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. 15న మొదటి, 16న ద్వితీయ సంవత్సర విద్యార్థుల పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. కళాశాలలోని 15 రూమ్‌లలో సీసీ కెమెరాల నిఘా మధ్య పరీక్షలను నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, విద్యార్థులు పరీక్షా సమయానికి 30 నిముషాల ముందు చేరుకోవాలన్నారు. 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు.

వేడుకగా నగర సంకీర్తన



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మాకవరపాలెం: వేంకటేశ్వరస్వామి నగర సంకీర్తనను భక్తులు వేడుకగా నిర్వహించారు. మండలంలోని తామరంలో ఉన్న స్వామివారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రం నుంచి ఆలయం వరకు నగర సంకీర్తన నిర్వహించారు. దీంతో గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

సీతంరాజుకు మద్దతుగా ప్రచారం



ఏఎల్‌పురంలో మండల కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న నాయకులు



డి. గోటివాడలో ప్రచారం చేస్తున్న నాయకులు

మాడుగుల: శనివారం డి. గోటివాడ మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మద్దతు ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని సర్పంచ్ గోకాడ అర్జునరావు, మాజీ సర్పంచ్ అల్లు రమణ ఓటర్లను అభ్యర్థించారు. అలాగే సత్యవరం, జంపెన, గాదిరాయి తదితర ప్రాంతాల్లో కూడా ఈ ప్రచారాన్ని కొనసాగించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు, పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కేజేపురంలో..

మాడుగుల రూరల్: వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలంటూ ఆ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు శనివారం ప్రచారం చేశారు. మేజర్ గ్రామ పంచాయితీ కేజేపురంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ జామి రమణబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు కాళ్ల రాము, పార్టీ నాయకులు కాళ్ల అప్పలనాయుడు, ఆడారి కన్నారావు, సూరిశెట్టి అచ్చిమినాయుడు, కాళ్ల జగస్ పాల్గొన్నారు. అలాగే వీవీ అగ్రహారం, జి. అగ్రహారం, పోతనపూడి తదితర గ్రామాలల్లో కూడా ప్రచారం సాగింది.

సీతంరాజును గెలిపించాలి

గొలుగొండ: వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసే విధంగా మండల కమిటీ అంతా కలిసి కట్టుగా పని చేయాలని నర్సీపట్నం మార్కెట్‌యార్డు చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు అన్నారు. ఏఎల్‌పురంలోని తన నివాసంలో శనివారం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. మండలంలో 1026 ఓట్లకు గాను గొలుగొండలో సోమవారం జరిగే ఎన్నికల్లో అత్యధికంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి రావాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జలపు మణికుమారి, మండల పార్టీ అధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, యువజన పార్టీ అధ్యక్షుడు రామకృష్ణనాయుడు, మండల సచివాలయ కన్వీనర్ పాణీశాంతారామ్‌తో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా తోటాడ సచివాలయం



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న తోటాడ సచివాలయం

మునగపాక : మండలంలోని తోటాడ సచివాలయం ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా రూ.48 లక్షల వ్యయంతో సచివాలయాన్ని నిర్మించారు. ఎంతో సుందరంగా సచివాలయాన్ని తీర్చిదిద్దారు. త్వరలో సచివాలయాన్ని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు చేతుల మీదుగా ప్రారంభించేందుకు అవసరమయ్యే ఏర్పాట్లు చేస్తున్నామని సర్పంచ్ దొడ్డి మంగవేణి తెలిపారు.

ఆలయ నిర్మాణంపై నేడు సమావేశం

మునగపాక: మండల కేంద్రంలో వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి ఆదివారం మునగపాక పంచాయతీ కార్యాలయం వద్ద సమావేశం జరుగుతుందని సర్పంచ్ దిమ్మల అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు సమావేశం జరుగుతుందన్నారు. మునగపాక ఇందిరమ్మ కాలనీ, బీసీ కాలనీ, వాడ్రాపల్లికి వెళ్లే దారిలోని దేవదాయ శాఖకు సంబంధించిన స్థలాలను పరిశీలించి ఆలయ నిర్మాణానికి నిర్ణయం తీసుకుంటారన్నారు. ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు, ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ అతిథులుగా హాజరయ్యే సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు.

నేడు సచివాలయాలు తెరిచే ఉంటాయి..

కోటవురట్ల : ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం కూడా సచివాలయాలు తెరుచుకుంటాయని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని సచివాలయాలను తెరవాలని ఆదేశాలిచ్చినట్టు తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తెరిచి ఉంటాయని, ఎక్కడైనా తెరవకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎడ్ల పోటీల విజేత ఎం.కొత్తపల్లి



ఎడ్ల పోటీలను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం బూడి సతీమణి రమణమ్మ

దేవరాపల్లి: ఎ.కొత్తపల్లి పంచాయతీ శివారు పందూరుపాలెంలో శ్రీ అభయాంజనేయ స్వామి తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా స్థాయి ఎడ్ల పోటీలు హోరాహోరీగా సాగాయి. జిల్లా వ్యాప్తంగా 16 ఎడ్ల బళ్లు పాల్గొన్నాయి. ఈ పోటీలను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సతీమణి బూడి రమణమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, మహిళా అధ్యక్షురాలు రొంగలి నారామణమ్మ, స్థానిక సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, ఉప సర్పంచ్ పందూరు సరువునాయుడు జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. ఇందులో ప్రథమ స్థానంలో ఎం.కొత్తపల్లి నంబారు గాయత్రి ఎడ్లు, ద్వితీయ స్థానంలో నర్సయ్యపేట ముమ్మిన రామకృష్ణ ఎడ్లు, తృతీయ స్థానంలో కేఎల్‌బీ పట్నం గండి కాసుల నాయుడు ఎడ్లు నిలిచాయి. ఆరు స్థానాలకు గాను విజేతలుగా నిలిచిన వారికి రూ. 10 వేలు, రూ. 8వేలు, రూ. 6వేలు, రూ. 4వేలు, రూ. 2వేలు, రూ. వెయ్యి చొప్పున ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల చేతుల మీదుగా బహుమతి నగదును అందజేశారు. అంతకు ముందు డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ సహా ఇతర నాయకులు అభయాంజనేయ స్వామిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

14న నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ



ఆల్బెండజోల్ మాత్రల ఉపయోగాలు వివరిస్తున్న ఎంపీహెచ్ఈవో రాజశేఖర్

మాడుగుల రూరల్: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 14న పాఠశాల విద్యార్థులు, అంగన్‌వాడీ చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు కేజేపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎల్.శివప్రసాద్‌పాత్రుడు శనివారం తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలో 28 ఎంపీపీ పాఠశాలలు, 2 యూపీ స్కూళ్లు, 5 హైస్కూళ్లు, 39 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 5400 మందికి ఈ మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. రెండు సంవత్సరాల లోపు వయసు కలిగిన వారికి అరమాత్ర, రెండు సంవత్సరాలు దాటిన వారికి ఒక మాత్ర వేయాలన్నారు. అదే విధంగా కింతలి పీహెచ్‌సీ పరిధిలో 36 పాఠశాలలు, 40 అంగన్‌వాడీ కేంద్రాల్లో సుమారు 4500 మందికి ఈ మాత్రలు పంపిణీ చేస్తామని వైద్యాధికారి కేఎం నాయుడు తెలిపారు.

విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన

కె.కోటపాడు : చౌడువాడ పీహెచ్‌సీ పరిధిలో 5400 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు ఎంపీహెచ్ఈవో కేవీ రాజశేఖర్ తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో గల చిన్నారులు, వారి తల్లిదండ్రులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ నెల 14న పీహెచ్‌సీ పరిధిలో గల ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కళాశాలల, కేజీబీవీ పాఠశాలల్లో విద్యార్థులకు మాత్రలు ఇస్తామన్నారు. ఈ మాత్రలు వేసుకోవడం వల్ల విద్యార్థుల్లో రక్తహీనత సమస్య వాటిల్లదని, ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సన్యాసమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త జగదీశ్వరి పాల్గొన్నారు.

జగనన్న రీసర్వేతో భూ సమస్యల శాశ్వత పరిష్కారం



గ్రామసభలో రైతులకు సూచనలు చేస్తున్న తహసీల్దార్ కనకారావు

నాతవరం: జగనన్న భూ రీసర్వేతో ఏళ్ల నాటి నుంచి వెంటాడుతున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని తహసీల్దార్ పి. కనకారావు అన్నారు. మండలంలో చొల్లంగిపాలెం రెవెన్యూ గ్రామంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ముందుగా రీసర్వే విధి విధానాలు, ప్రభుత్వ నిబంధనల గురించి రైతులకు వివరించారు. అనంతరం రైతుల నుంచి ఫిర్యాదులు, సలహాలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు, ప్రజా ప్రతినిధులు సహకరిస్తే సకాలంలో సర్వే పూర్తి చేస్తామన్నారు. మండలంలో మొత్తం 39 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయని వాటిలో 38 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి చేసామన్నారు. రీసర్వే సమయంలో రెవెన్యూ అధికారులు రైతులను ఇబ్బంది పెడితే తన దృష్టికి తీసుకురావాలన్నారు. రైతులు ఎవరికీ డబ్బులు ఇవ్వరాదన్నారు. అనంతరం రైతులు అడిగిన ప్రశ్నలకు తహసీల్దార్ సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, ఆర్‌ఐ నారాయణరావు, సర్వేయర్ విజయకుమార్, వీఆర్వో, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరసిద్ధి వినాయకునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

రావికమతం: టి.అర్జాపురంలోని శ్రీవరసిద్ధి వినాయక ఆలయంలో సంకష్టహర చతుర్థి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 20 మంది దంపతులచే ఆలయ ప్రధానార్చకులు లక్ష్మణమూర్తి ప్రత్యేక దూర్వాయుగ్మార్చన, పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

14న గంగ పరదేశమ్మ పండగ



గంగ పరదేశమ్మ అమ్మవారి పండగ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి

మునగపాక : మండలంలోని గవర్ల అనకాపల్లిలో ఈ నెల 14న గంగ పరదేశమ్మ అమ్మవారి పండగను ఘనంగా జరుపుకోవాలని అనకాపల్లి ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి కోరారు. శనివారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత పండగలను సమష్టిగా జరుపుకోవాలన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలన్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు, ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత షేక్ ఇస్మాయిల్, ఉత్సవ కమిటీ చైర్మన్ మళ్ల ఈశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నేత శేషు, వార్డు సభ్యులు పాల్గొన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ కూడా పండగ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం నేడు

దేవరాపల్లి: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని కలిగొట్లలో ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బూరె బాబురావు తెలిపారు. ఉదయం 8 గంటలకు జరిగే వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు పాల్గొంటారన్నారు. ముందుగా దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి, అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరీ, జెడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం హాజరవుతారని, అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ అధ్యక్షులు, కార్పొరేషన్ల డైరెక్టర్లు, పార్టీ నాయకులు హాజరు కావాలన్నారు.

చీడికాడలో..

చీడికాడ: మండల కేంద్రం చీడికాడలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం నిర్వహించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు తెలిపారు. ఉదయం 9 గంటలకు సావిడి వద్ద గల వైఎస్ విగ్రహ ప్రాంగణంలో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు

ఎంపికైన వారికి నియమాక పత్రాల అందజేత

నర్సీపట్నం: ఎస్ఐబీటీ, ఐసీఐసీఐ బ్యాంక్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీవిద్య కళాశాల ఆవరణలో శనివారం జాబ్ మేళా నిర్వహించారు. కళాశాల కస్పాండెంట్ గాడి సత్యవతి మేళాను ప్రారంభించారు. డిగ్రీ ఉత్తీర్ణులైన విద్యార్థులు, చదువుతున్న వారు ఈ మేళాకు హాజరయ్యారు. ఎస్ఐబీటీ హెచ్ ఆర్ మేనేజర్ పి.పృథ్వీ, కె.ప్రసాద్ ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపికైన అభ్యర్థులకు నియమాక పత్రాలు అందజేశారు. డైరెక్టర్ బి.దొరబాబు, కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.